క్లుప్తంగా

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు



ఇరుగువాయిలో పైపులకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నింద్ర: మండలంలోని ఇరుగువాయి గ్రామ పంచాయితీలో శనివారం బీసీ కాలనీలో తాగునీరు సరఫరా అయ్యే పైపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. దీనిపై స్పందించిన గ్రామ సర్పంచ్ రాజేష్ తాగునీటి పైపులకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. అదేవిధంగా నింద్ర గ్రామంలో కూడా సర్పంచ్ వసంతమ్మ మరమ్మతులకు గురైన తాగునీటి మోటారును మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితులకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందిస్తున్న ప్రజాప్రతి నిధులు

పాలసముద్రం : మండలంలోని ఆముదాల పంచాయతీ గొల్లకండ్రిగ సమీపంలోని ఎస్టీ కాలనీలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన వారికి శనివారం జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసి రామ్ యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ బాధితులకు కొత్త దుస్తులు, బియ్యం, కూరగాయలు అందించారు. వారు మాట్లాడుతూ కాలిపోయిన నాలుగు కుటుంబాల వారికి ప్రభుత్వం తరపున కొత్త ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. వారు ఇళ్లు కట్టుకునే వరకు ఉండడానికి బాడుగ ఇళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం దుస్తులు, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, సర్పంచ్ అనరేఖ, గాలి మహేష్ బాబు, ఎంపీటీసీ లిఖిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మృతి చెందిన రమేష్

శ్రీరంగరాజపురం : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి వెలుగుచూసింది. ఎస్‌ఐ షెక్షావలి వివరాల మేరకు.. మండలంలోని పిళ్లారుకుప్పం నుంచి మంగుంట గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చాంద్‌బాషాకు చెందిన మామిడి తోపునకు బుడ్డమ్మ కాపలాగా ఉంటోంది. శుక్రవారం రాత్రి ఆ మామిడి తోపులోకి బీఎన్ కండ్రిగ మండలం నీరప్పకోట గ్రామానికి చెందిన ఎస్.కృష్ణయ్య కుమారుడు ఎస్.రమేష్ (34) వచ్చాడు. రాత్రి మద్యం సేవించి, అక్కడే భోజనం చేసి పడుకున్నాడు. ఇతను తరచూ ఇక్కడికి వచ్చి వెళ్తుంటాడు. ఆ క్రమంలోనే శనివారం కూడా ఉదయం రమేష్‌ను నిద్రలేపగా స్పందన లేదు. అప్పటికే మరణించినట్లు తెలిసింది. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షెక్షావలి తెలిపారు.

శ్రీసిటీలో 'గజేంద్ర మోక్షం' కథా ప్రవచనం



గజేంద్రమోక్షం కథా ప్రవచనం చేస్తున్న రవి

సత్యవేడు: శ్రీసిటీలోని అధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పండిత కవి ఒంటి రవి గజేంద్రమోక్షం కథా ప్రవచనం చేశారు.. శనివారం ఆలయ ప్రాంగణంలో భాగవతంలోని ఓ అద్భుత ఘట్టం గజేంద్రమోక్షం. ఇందులో మదించిన, అహంకరించిన ఏనుగు, చివరకు సర్వం కోల్పోయి శ్రీహరి శరణు కోరి శరణాగతిని పొంది ఎలా శ్రీహరి భక్తుడిగా మారిందో శ్రోతలకు వినసొంపుగా ఒంటి రవి వివరించారు. బాధల్లో ఉన్న వారు భగవంతుని స్మరిస్తే తప్పక ఫలితం దక్కుతుందన్నది దీని సారాంశమని ఆయన చెప్పారు. కథా ప్రవచనం ప్రారంభానికి ముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశారు. శ్రీసిటీలో శ్రీసిటీ మేనేజింగ్‌డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పి.బాలాజీ, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఆటల్లో బిజీబిజీ..

విద్యార్థులతో క్రీడామైదానాలు సందడిగా మారాయి. సమ్మర్ క్యాంపుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత క్రీడా శిక్షణ విద్యార్థులకు ఉపయోగపడుతోంది. పిల్లలు ఇంటి దగ్గర కంటే మైదానంలోనే ఎక్కువ గడుపుతున్నారు. తద్వారా ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి వీలు పడుతోంది. వారిని జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా తర్ఫీదు ఇస్తున్నారు కోచ్‌లు.

- క్రీడాకారులతో కిటకిటలాడుతున్న నగరి డిగ్రీ కళాశాల మైదానం
- వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు
- ఆరోగ్యంతో పాటు విజ్ఞానం



స్టేడియంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నగరి : వేసవిలో రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న ఉచిత వేసవి క్రీడాశిక్షణ తరగతుల వైపు తమ పిల్లలను అడుగులు వేయిస్తున్నారు. సెలవుల్లో ఆనందంగా గడపడంతో పాటు ఆటలాడుతూ గడపాలన్న నినాదంతో ముందుకు సాగుతున్నారు. నగరి నియోజకవర్గంలోని కేవీకే మైదానంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉచిత క్రీడాశిక్షణ శిబిరాలకు ఉత్సాహంగా హాజరు అవుతున్నారు. క్రికెట్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ లాంటి ఆరోగ్యాన్ని ఇచ్చే క్రీడల్లో శిక్షణ పొందడంతో పాటు మేధస్సును పెంచే చెస్, క్యారంబోర్డు, మానసిక దృఢత్వాన్ని ఇచ్చే యోగా లాంటి వాటిల్లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

క్రీడాకారులకు ఉపయోగపడేలా..

నియోజకవర్గంలోని క్రీడాకారులకు ప్రయోజనకరం కావాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులకు అత్యుత్తమ క్రీడా పాఠాలు బోధిస్తున్నారు. ఈ నెల 24వ తేదీన రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా ఈ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఫలితంగా విద్యార్థులు నిత్యం క్రీడల సాధనలో కేరింతలు కొడుతున్నారు. ప్రభుత్వం ఎంపిక చేసి నియమించిన సుశిక్షితులైన ఆరుగురు కోచ్‌లు తర్ఫీదు ఇస్తున్నారు. వీరితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా శాప్ నుంచి వచ్చే కోచ్‌లు విద్యార్థులకు అందించే శిక్షణలో నియోజకవర్గవ్యాప్తంగా 150 మంది బాల బాలికలు సాధన చేస్తుండడం విశేషం. అన్ని వసతులు ఉన్న ప్రాంగణం కావడంతో పాటు నైపుణ్యం కలిగిన శిక్షకులు ఉండడంతో ఈ కేంద్రం సహజంగానే అందరినీ ఆకర్షిస్తోంది.



క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



చెక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



బాల్‌బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

క్రీడాకారులను గుర్తించడానికి వీలు..



"కోచింగ్‌కు వచ్చిన విద్యార్థుల్లో కొందరిలో మంచి ప్రతిభ కనిపిస్తోంది. వారి వివరాలను స్పోర్ట్స్‌కు సంబంధించిన ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. వారు చక్కగా శిక్షణ తీసుకుంటే జాతీయస్థాయిలో రాణించేలా ఎదుగుతారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించడానికి వేసవి క్యాంపులు చక్కని వేదికగా ఉన్నాయి. – బాబు, శాప్ కోచ్

క్రీడాకారులకు ఇది సదావకాశం..



వేసవి క్రీడా శిబిరాలు ఏర్పాటు విద్యార్థులకు దక్కిన సదావకాశం. పలువురు విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఇటీవల నగరి నుంచి జాతీయ స్థాయిలో పతకాలను సాధించుకు వచ్చిన క్రీడాకారులను తయారు చేశాం. ఇప్పుడు వేసవి శిబిరాల్లో అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నాం. భవిష్యత్‌లో విద్యార్థులు మరింత రాణించే అవకాశం ఉంటుంది.

– గోపీ, బాల్‌బ్యాడ్మింటన్ కోచ్

వ్యాక్సినేషన్ తప్పనిసరి

విజయపురం (నగరి) : ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలని పీహెచ్‌సీ డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. శనివారం ఎం.అగరం గ్రామంలో 5 ఐదేళ్లలోపు పిల్లలకు ఏఎన్‌ఎం, వైద్యసిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సిన్ వేయించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి వైద్యసేవలు అందించాలని డాక్టర్ సోమశేఖర్ సిబ్బందికి సూచించారు. గర్భిణులతో పాటు, పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వీల్‌చైర్, మంచం వితరణ



ఉపకరణాలను అందిస్తున్న దాతలు

నగరి : స్థానిక ఏరియా ఆస్పత్రికి చంద్రారెడ్డి, శీనురాజ్ అనే దాతలు రోగులకు ఉపయోగపడే ఉపకరణాలను వితరణగా అందించారు. చంద్రారెడ్డి రూ.15 వేలు విలువచేసే వీల్‌చైర్‌ను అందించగా, శీనురాజ్ రూ.15 వేలు విలువచేసే ఇనుప మంచాన్ని అందించారు. శనివారం మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతికి వారు ఉపకరణాలను అందజేశారు. ఆస్పత్రికి సహకారం అందించిన దాతలకు మెడికల్ సూపరింటెండెంట్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. శనివారం ఆయన నరసింహాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. సమస్యలతో సచివాలయానికి వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలిగి వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ఆయన కార్యాలయ రికార్డులను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీప్రసన్న వేంకటేశ్వరుడి గ్రామోత్సవం



భక్తులను కటాక్షిస్తున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి

వడమాలపేట : అప్పలాయగుంటలో టీటీడీకి అనుబంధంగా వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించారు. వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారికి ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. అనంతరం సర్వఅలంకారభూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, షరాబు రామకృష్ణ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన



పెనుమూరు: ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): అమృత్ సరోవర్ పథకం ద్వారా చేపడుతున్న ఫాం పాండ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. శనివారం ఆమె మండలంలోని రామకృష్ణాపురం, సాతంబాకం, పులికల్లు గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కూలీలు జీవనం కోసం ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ముందస్తుగానే ఉపాధి పనులు కల్పించాలన్నారు. పని కావాలని కోరిన ప్రతి ఒక్కరికీ వెంటనే పనులు కల్పించేందుకు అవసరమైన జాబ్‌కార్డులను అందజేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె పులికల్లు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఏపీడీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ వైద్య సేవలు అందించండి

- జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి తుడా: బేసిక్ కార్డియాక్ లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ పొందిన సిబ్బంది ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో 40 మంది వైద్యసిబ్బందికి ఈనెల 22 నుంచి బేసిక్ కార్డియాక్ లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. మొదటి బ్యాచ్‌లో ప్రాథమిక కార్డియాలజీ సమస్యలను ఎదుర్కోవడంపై నిపుణులు అవగాహన కల్పించారు. వారికి శనివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎవరైనా హార్ట్ స్ట్రోక్‌కు గురైతే గోల్డెన్ టైంలో వారికి ప్రాథమిక చికిత్స అందించగలిగితే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం మండలాల వారీగా కొంతమంది వైద్యసిబ్బందికి బేసిక్ కార్డియాక్ లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన సిబ్బంది ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో ఉండి కార్డియాక్ అరెస్ట్ వంటి సమస్యలు ఎదురైన వారికి వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్డియో ఫల్మనరీ రెసిగ్నేషన్ కృత్రిమ మానవ బొమ్మల ద్వారా సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సుబ్బారావు, నోడల్ ఆఫీసర్ ఎం.సుధాకర్ నాయక్, డాక్టర్ రవిశంకర్, ట్రైనింగ్ ఇన్‌చార్జ్, సీఎస్ ఆర్ఎంవో పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి



సత్కారాలు అందుకున్న వలంటీర్లతో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : సంక్షేమ పథకాలను పేదలకు చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేయడం వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. ఇదే తరహాలో రాగద్వేషాలకు అతీతంగా ప్రభుత్వ విధులను నిర్వర్తించాలని వలంటీర్లకు మంత్రి సూచించారు. విప్లవాత్మకమైన వలంటీర్ల వ్యవస్థపై దేశంలోనే అధ్యయనం జరుగుతోందన్నారు. ప్రభుత్వ సేవా వారధులైన వలంటీర్లపైనే పార్టీ విజయం ఆధారపడి ఉందని తెలిపారు. రైతులు, వృద్ధులు దివ్యాంగులు, వితంతువులు వలంటీర్ల వ్యవస్థను తెరపైకి తెచ్చిన జగనన్నను అభినందిస్తున్నారని తెలిపారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే సుదూరం వెళ్లి పడిగాపులు పడే పరిస్థితి ఉండేదని, ఈ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదని, సూర్యోదయానికి ముందే వలంటీర్లు తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారని గుర్తు చేశారు. నిత్యం క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు, అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత కూడా వలంటీర్లదే అన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కూడా వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం సేవారత్న, సేవామిత్ర అవార్డులతో వలంటీర్లను సత్కరించారు. ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్నయనాథన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కే.కృపాలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వలంటీర్లకు వందన కార్యక్రమాన్ని ఎంపీపీ లత చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ, పథకాలకు అర్హుల ఎంపిక, ధ్రువీకరణ పత్రాల మంజూరు తదితర పనుల్లో ప్రజలకు సాయం చేస్తూ వలంటీర్లు ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాల్లో గెలుపు ఖాయమన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ వలంటీర్లు ఉత్తమ సేవలు అందించి పార్టీకి విజయ సారథులుగా నిలవాలన్నారు. అనంతరం వలంటీర్లకు సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర అవార్డులతో శాలువలు కప్పి మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముందుగా మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, స్థానిక సర్పంచ్ ధనుంజయ వర్మ, వైస్ ఎంపీపీ మణెమ్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, పురంధర్, ఎంపీడీఓ మోహన్‌మురళి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృపాలక్ష్మి

వలంటీర్లకు వందనం

నింద్ర: మండల కేంద్రం నింద్ర సచివాలయంలో ప్రజలకు ఉత్తమసేవలు అందిస్తున్న వలంటీర్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో వలంటీర్ల సేవలు ఎంతో ప్రాముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విశేష సేవలు అందిస్తున్న వారికి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ వసంతమ్మ, వైఎస్సార్ సీపీ యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.



నింద్ర: వలంటీర్లను సన్మానిస్తున్న అధికారులు

ముక్కంటి సేవలో ప్రముఖులు



నటి కీర్తి సురేష్

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం ఆర్అండ్‌బీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేవీ.సాగర్ బాబు స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అలాగే సినీ నటి కీర్తి సురేష్ స్వామి అమ్మవారి దర్శించుకున్నారు. వారికి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్ మాలిక్, ఆర్‌టీఓ దామోదరం నాయుడు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



పీఎస్ ప్రద్యుమ్న